క్లుప్తంగా

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కృష్ణా: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం మండలంలోని ఆలంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సర్ఫరాజ్, నాయకులు శివరాంరెడ్డి, ఆనంద్‌గౌడ్, పల్లె సురేష్, వీరేంద్రపాటీల్, ఎంపీడీఓ జానయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు కంటే ప్రభుత్వ బడులే ఉత్తమం



కృష్ణా: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడుల్లో కూడా నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు కున్సీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజ్ అన్నారు. సోమవారం గ్రామంలో ఆయన 'బడిబాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న వసతుల గురించి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అఖిల పక్షాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం



మక్తల్: తెలంగాణ మహిళ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సోమవారం పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మక్తల్‌కు చెందిన ఉద్యమకారుడు రుద్రసముద్రం రాంలింగం కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి చేయాలి

నారాయణపేట: నిరంతర విద్యుత్ సరఫరాకు విద్యుత్ శాఖ సిబ్బంది కృషి చేయాలని ఎస్‌ఈ వెంకటరణ అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం జాతీయ పతకాన్ని ఆవిష్కరించిన అనంతరం విద్యుత్‌శాఖ సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ శాఖలో పనిచేసే కార్మికుల కృషితోనే విద్యుత్ సంస్థ మనుగడకు ప్రతి కార్మికుడు అకుంఠిత దీక్షతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు.అనంతరం మన తెలంగాణ అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల త్యాగాలను స్మరించుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్

కొత్తపల్లి: మండల పరిధిలోని అల్లీపూర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం గృహ నిర్మాణ శాఖ పీడీ గుగులోతు శంకర్ నాయక్ గ్రామ మాజీ సర్పంచ్ రమేష్ రెడ్డితో కలిసి మార్కింగ్ వేశారు. అల్లీపూర్ గ్రామ పంచాయతీకి 20 ఇళ్లు మంజూరు కాగా సోమవారం నాలుగు ఇళ్లకు మార్కింగ్ వేసి భూమి పూజలు నిర్వహించారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చొరవతో మండలంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు సర్సింములు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడలపై దృష్టి పెట్టాలి

నారాయణపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ క్రికెటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ లీగ్ పోటీలు జరుగగా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ట్రైనీ ఎస్‌ఐ రేవతి, డీవైఎస్‌ఓ వెంకటేశ్ శెట్టి, పరిశీలకులు మహ్మద్ మక్తర్ అలీ, అజయ్ కుమార్, చెన్నారెడ్డి, కోటి రవి పాల్గొన్నారు.



మక్తల్‌లో జెండా ఎగురవేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



కోస్గిలో ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



నర్వ మండల పరిషత్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు



మరికల్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీ సీఈఓ శైలేష్



మాగనూర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

అమరుల త్యాగాల ఫలితమే 'తెలంగాణ'

సాక్షి నెట్‌వర్క్: అమరవీరుల త్యాగాల ఫలితంగా పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చేందుకు కృషి చేయాలని అధికారులు సూచించారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా వ్యాప్తంగా వేడుకలు జరుపుకున్నారు.

❖ నారాయణపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుదర్శన్ తహసీల్దార్ కార్యాలయంలో అమరేంద్ర కృష్ణ, డీఈఓ కార్యాలయంలో గోవిందరాజు, ఎమ్మార్సీలో ఎంఈఓ బాలాజీ, ఆర్టీసీ డిపోలో డీఎం లావణ్య, బీజేపీ కార్యాలయంలో నేతలు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

❖ కోస్గిలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అలాగే పార్టీ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండాను ఎగురవేసి వేడుకలు జరుపుకున్నారు. అలాగే రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు.

❖ నర్వ మండలంలో ఎంపీడీఓ శ్రీనువాసులు, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మల్లారెడ్డి, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ కురుమయ్య, పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సబ్‌స్టేషన్‌లో ఏఈ రాజేందర్‌గౌడ్, పీహెచ్‌సీలో వైద్యులు వెంకటరమణలు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

❖ మరికల్‌లోని ఇంటిగ్రేటెడ్ తహసీల్దార్ కాంప్లెక్స్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి శైలేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలగే బీఆర్‌ఎస్ నాయకులు పార్టీ జెండాను ఎగరవేసి సంబరాలు చేసుకున్నారు.

❖ కొత్తపల్లిలోని తహసీల్దార్ కార్యాలయంలో జయరాములు,మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణారావ్, వ్యవసాయ కార్యాలయంలో రమేశ్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ అమరవీరులకు నివాళులు అర్పించి కాసేపు మౌనం పాటించారు.

❖ మాగనూర్‌లో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని నల్లగట్టు దగ్గర ఆయన జాతీయ జెండా ఎగురవేసి కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

❖ కృష్ణా మండలంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలతో పాటు గ్రామ పంచాయతీ కార్యాలయాల ముందు అధికారులు జాతీయజెండాను ఆవిష్కరించారు.

❖ మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల నాయకుడు నీలప్ప ముదిరాజ్ ఆధ్వర్యంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జెండాను ఆవిష్కరించారు.

❖ మద్దూరు పట్టణంలోని వివేకానంద చౌరస్తాలో బీఆర్‌ఎస్ పార్టీ జెండాను పట్టణ అధ్యక్షుడు మహేందర్ ఆవిష్కరించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు.



నారాయణపేటలోని బీజేపీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

❖ ధన్వాడ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో సింధూజ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సాయి ప్రకాష్, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్, మత్స్యకార్మికుల సంఘంలో అధ్యక్షులు నర్సింములు నాయుడు, సింగల్ విండో అధ్యక్షుడు వెంకట్రామ్‌రెడ్డి తెలంగాణ జెండాను ఆవిష్కరించారు.

❖ ఊట్కూరు మండలంలోని పంచాయతీ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి ప్రత్యేకాధికారి ధనుంజయ గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కొనియాడారు. దామరగిద్ద మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జమిల్, ఎంపీడీఓ కార్యలయంలో ఎంపీడీఓ నాగలక్ష్మి, విండో అధ్యక్షుడు ఈదప్ప, ఎస్‌ఐ రాజులు ఆయా కార్యాలయల్లో జెండా ఆవిష్కరణ చేసి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు.

❖ నారాయణపేటలోని భీష్మరాజ్ ఫౌండేషన్ కార్యాలయం దగ్గర జాతీయ జెండాను భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలు మరువలేనివని కొనియాడారు.



కృష్ణాలోని మురహర్‌దొడ్డిలో జెండా వందనం చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు



జాతీయ జెండాకు వందనం చేస్తున్న నాయకులు



మద్దూరులో నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



ధన్వాడ తహసీల్దార్ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న సింధూజ



దామరగిద్ద తహసీల్దార్ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



ఊట్కూరులో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న అధికారి ధనుంజయగౌడ్



కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూర్: మండల పరిధిలోని తాళంకేరి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆంజనేయస్వామి, శివలింగం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ తాజా, మాజీ ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డిలు పాల్గొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులతో కలిసి విగ్రహాల ప్రతిష్ఠాపన చేశారు. నియోజకవర్గంలో ఇంత పెద్ద రాతితో నూతన దేవాలయం నిర్మాణం కావడం సంతోషకర విషయమని, చుట్టూ పచ్చటి పొలాలు మధ్యలో గుడి నిర్మించిన గ్రామస్తులను అభినందించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

మాగనూర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మాగనూర్ మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏప్రిల్ 25 నుంచి నిర్వహిస్తున్న వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంపు సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని విద్యార్థులను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుపై దృష్టి పెట్టకుండా క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో పీడీ రాకేష్ శర్మ, మాజీ సర్పంచ్ రాజు, శంకర్, వాబయ్య, గణేష్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో మురళీధర్‌రెడ్డి

రోడ్డు విస్తరణ పనులకు భూమిపూజ



ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అనుమతి పత్రాలు అందజేస్తున్న తిరుపతి రెడ్డి

కొత్తపల్లి: మండల పరిధిలోని భూనీడు–వింజమూర్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించనుండడంతో పనులకు సోమవారం కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి, కాడా ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.6.39 కోట్లు మంజూరు చేయడంతో పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ రోడ్డు పనులు పూర్తి అయితే మద్దూరు నుంచి భూనీడు, వింజమూర్, మహబూబ్ నగర్‌కు వెళ్లే వాహనాలకు ఇబ్బందులు తీరుతాయన్నారు. అనంతరం మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణారావ్, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింములు, మాజీ జెడ్పీటీసీ రగుపతి రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

93 మందికి కంటి పరీక్షలు

కోస్గి : జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ , లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరం విజయవంతమైందని వైద్యులు భాస్కర్‌గౌడ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి అవరణలో నిర్వహించిన శిబిరంలో 93 మందికి పరీక్షలు నిర్వహించగా 36 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్టు గుర్తించారు. వీరిని జిల్లాలోని రాంరెడ్డి కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పూర్ణచంద్రయాదవ్ , జిల్లా క్యాబినెట్ ఉపాధ్యక్షులు బెజ్జు వెంకట్రాములు , వెన్నశేఖర్ పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న భాస్కర్‌గౌడ్

మరికల్ తహసీల్దార్‌గా రాంకోటి



మరికల్: మండల తహసీల్దార్‌గా రాంకోటి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మరికల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అనిల్‌కుమార్ ఆర్డీఓ కార్యాలయం ఏవోగా బదిలీ కాగా ఆయన స్థానంలో రాంకోటి మరికల్‌కు బదిలీ అయ్యారు. 2022లో ఇద్దరు తహసీల్దార్లు, ఒక సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కడంతో గడిచిన మూడేళ్ల వ్యవధిలోనే పది మంది తహసీల్దార్లు వచ్చిన వారు వచ్చినట్లుగా మూడు లేక ఆరు నెలల వరకే విధులు నిర్వహించి బదిలీ అవుతున్నారు. దీంతో మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సేంద్రియ సాగుతో అధిక లాభాలు

దామరగిద్ద: సేంద్రియ పద్ధతిలో పంటలను సాగు చేయడం వల్ల అధిక ప్రయోజనం పొందవచ్చని ఏఎంఓ మణిచందర్ అన్నారు. సోమవారం మండలంలోని లోకూర్తి రైతు వేదికలో సేంద్రియ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. తక్కువ పెట్టుబడితో జీవామృతం నీమాస్త్రం, వంటి పలురకాల కషాయాలతో పంటలకు చీడ, పీడలు పట్టకుండా రక్షించుకోవచ్చన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం , పశుపోషణ, సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెంచి నాణ్యమైన పంటలను పొందవచ్చన్నారు. వాటర్‌షెడ్ సంస్థ సభ్యులు వరదన్న విత్తన శుద్ధి ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అజయ్, ఆంజనేయులు శ్రీనివాస్‌రెడ్డి, లోకూర్తి మల్‌రెడ్డిపల్లి. ఉల్లిగుండం రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



మద్దూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జోగు లవకుమార్ కుటంబానికి న్యాయం చేయాలంటూ నాగంపల్లి గ్రామాస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారితో కలిసి సోమవారం మద్దూరు పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. లారీ డ్రైవర్ మహమ్మద్ ఆదిల్ బాషా నిర్లక్ష్యంతోనే లవకుమార్ చనిపోయాడన్నారు. పరారీలో ఉన్న ఆదిల్ బాషాను పట్టుకొని అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చివరికి పోలీసులు అక్కడి చేరుకొని వారికి నచ్చజెప్పి ధర్నాను విరమింపజేశారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

నారాయణపేట రూరల్ : భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులు నేటి నుంచి ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 3న బైరంకొండ, అంత్వార్ 4న ఎక్లాస్‌పూర్, శేర్నపల్లి 5న జలాల్‌పూర్, లింగంపల్లి, 6న పేరపళ్ళ, చిన్నజట్రం, 9న సింగారం, కొల్లంపల్లి, 10న జాజాపూర్, అభంగాపూర్, 11న అప్పక్‌పల్లి, బొమ్మన్‌పాడు, 12న అమ్మిరెడ్డిపల్లి, తిర్మలాపూర్, 13న అప్పిరెడ్డిపల్లి, కోటకొండ గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ధన్వాడ: నేటి నుంచి భూ భరతి రెవెన్యూ సదస్సులు ప్రారంభం కానున్నట్లు మండల తహసీల్దార్ సింధూజ తెలిపారు. 3న కంసాన్‌పల్లి, 4న పాతపల్లి, 5న గున్ముక్ల, 6న యంనోనిపల్లి, 9,10వ తేదీలలో ధన్వాడ, 11న మందిపల్లి, 12,13న కిష్టాపూర్, 16,17న గోటూర్, 18,19వ తేదీలలో కొండాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ సదస్సులు జరుగుతాయని తెలిపారు. ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కోస్గి రూరల్: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను రైతు లు సద్వినియోగం చేసుకోవాలని గుండుమాల్ మండల తహసీల్దార్ భాస్కర స్వామి సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి 16 వరకు మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీలలో ఉదయం 9–30 గంటల నుంచి 4 గంటల వరకు సదస్సులు కొనసాగుతాయన్నారు. 3న అప్పాయపల్లి, 4న భోగారం, 5న గుండుమాల్, 6న సారంగరావుపల్లి, 9న భక్తిమళ్ల, 10న ముదిరెడ్డిపల్లి ,11న అమ్లీకుంట, 12న బలుబద్రాయపల్లి,13న వీరారం , 16న కొమ్మూరులో సదస్సులు జరుగుతాయన్నారు.

మద్దూరు మున్సిపాలిటీలో కౌన్సిల్ స్థానాల విభజన

మద్దూరు: నూతనంగా ఏర్పడిన మద్దూరు మున్సిపాలీటిలో 16 కౌన్సిల్ స్థానాలను ఏర్పాటు చేయడానికి విభజన ప్రక్రియ చేపట్టినట్లు పుర కమిషనర్ శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 27న ఏర్పడిన మద్దూరు మున్సిపాలీటిలో మూడు రోజుల క్రితం భీంపూర్, నాగంపల్లి, ఎర్రగుంటతాండా, సాపన్‌చెరువు తాండాలు వీలినం కావడంతో కౌన్సిల్ స్థానాల ఏర్పాటు చేపట్టినట్లు పేర్కొన్నారు. 16 కౌన్సిల్ స్థానాల డ్రాఫ్ట్ నోటిఫికేషన్ నేడు విడుదల చేస్తామని వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 5 నుంచి 10 వరకు అర్జీలు అందజేయవచ్చన్నారు. ఈ నెల 12 నుంచి 16 వరకు సవరించిన స్థానాలను ప్రదర్శించి, ఈ నెల 17, 18 తేదిలో ప్రజాప్రతినిధులు అమోదం తర్వాత 19న జిల్లా కలెక్టర్ అమోదం కోసం పంపనున్నట్లు తెలిపారు.



మద్దూరు మున్సిపాలిటీలో విభజన ప్రక్రియపై చర్చిస్తున్న అధికారులు

'కొడంగల్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం'

మద్దూరు: కొడంగల్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి అన్నారు. సోమవారం మద్దూరు మండలంలో రూ.30.52 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో మద్దూరు నుంచి మోమినాపూర్ వయా రెణివట్ల, చెన్నారెడ్డిపల్లి వరకు బీటీ రోడ్డు, అలాగే రూ.23.10 కోట్లతో మద్దూరు నుంచి ఖాజీపూర్ శివారు వరకు రోడ్డు విస్తరణకు కడా అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి భూమి పూజ నిర్వహించారు. రోడ్ల నిర్మాణ పనులు పూర్తి అయితే మండలంలోని అన్ని గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, పార్టీ నాయకులు హన్మిరెడ్డి, రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ

కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల్లో అభ్యున్నతను పెంచి వారి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడమే లక్ష్యంగా పని చేస్తున్నామని కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి , కడా చైర్మన్ వెంకట్‌రెడ్డిలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సరోజ్‌ఖాన్‌పేట్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మించి ఇస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజల్లో ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

ఆలయాల నిర్మాణానికి విరాళాల అందజేత

ఆత్మకూర్: ఆత్మకూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోశమ్మ, కర్రెమ్మ, లింగమయ్య, కోటమైసమ్మ, కట్టమైసమ్మ, భూలక్ష్మమ్మ, బొడ్రాళ్లు ఆలయాల నిర్మాణానికి భక్తులు భారీగా విరాళాలు అందజేశారు. సోమవారం హైదరాబాద్ కాంట్రాక్టర్ తంగేళ్ల శివకుమార్ రూ.2.50 లక్షలు అలాగే బంగారు భాస్కర్, బంగారు ప్రకాష్, రవికుమార్‌లు రూ.2.50 లక్షలు నగదను నిర్వాహకులకు అందజేశారు. ఆలయాల నిర్మానాలకు, ప్రతిష్ఠ మహోత్సవానికి రూ. 2.50 కోట్లకు పైగా ఖర్చు అవుతుందని భక్తులు పెద్ద ఎత్తున విరాళాలు అందించాలని నిర్వాహకులు కోరారు.